
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7

శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 25 సెప్టెంబరు 2025

మహిళా ప్రాంగణంలో కోర్సులకు దరఖాస్తులు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల ఎన్టీఆర్ నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారితా కేంద్రంలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మేనేజర్ పి.విమల ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్, కంప్యూటర్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ కోర్సుల్లో చేరేందుకు పదో తరగతి విద్యార్హత కలిగిన 18-40ఏళ్ల లోపు మహిళలు అర్హులన్నారు. కుల, జనన ధ్రువీకరణ, ఆధార్, రేషన్‌కార్డులతోపాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో అక్టోబరు 3లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 99485 30183, 7013922923, 83095 48067 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.


కొత్తమ్మ తల్లి ఆలయం వద్ద భక్తుల రద్దీ


శోభాయాత్రను ప్రారంభిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వైభవంగా కొత్తమ్మతల్లి శోభాయాత్ర

- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళిలో కొత్తమ్మతల్లి శోభాయాత్ర వైభవంగా సాగింది. కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు బుధవారం కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రెండు కిలోమీటర్ల పరిధిలో ఎటు చూసినా భక్తజన సందోహం కనిపించింది. ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఆలయ ప్రాంగణంతో పాటు గ్రామమంతటా విద్యుత్ వెలుగులు ధగధగలాడాయి. బుధవారం సాయంత్రం శోభాయాత్రను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ (మిగతా 8వ పేజీలో..)


శోభాయాత్ర రథం..

మినీ అంగన్‌వాడీలకు తీపికబురు!

- జిల్లాలో 446 ప్రధాన కేంద్రాలుగా గుర్తింపు
- కార్యకర్తలకు పెరగనున్న వేతనాలు

మెళియాపుట్టి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మినీ అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చనుంది. అందులో పని చేస్తున్న కార్యకర్తలకు వేతనం రూ.7 వేల నుంచి రూ.11,500 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. వైసీపీ ప్రభుత్వ పాలనలో మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చి అభివృద్ధి చేయాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన (మిగతా 8వ పేజీలో..)

- మెళియాపుట్టి మండలం పెద్దమడి గ్రామంలోని మినీ అంగన్‌వాడీ కేంద్రంలో 16 మంది పిల్లలు ఉన్నారు. దీనిని ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంగా మార్చాలని గతంలో ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం మినీ నుంచి ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంగా మార్చేలా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

....

- మెళియాపుట్టి మండలం టీకేఆర్ పురంలోని మినీ అంగన్‌వాడీ కేంద్రంలో 25 మంది చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలు మరో 20 మంది ఉన్నారు. ఈ అంగన్‌వాడీని మెయిన్ కేంద్రంగా గుర్తించాలని వైసీపీ పాలనలో గ్రామస్థులు ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్పందించి మెయిన్ కేంద్రంలో గుర్తించేలా చర్యలు తీసుకోవడంతో గ్రామస్థులు ఆనందపడుతున్నారు.


మినీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

ఈ కార్డుతో ప్రయోజనాలెన్నో
- వృద్ధులకు వరంగా సీనియర్ సిటిజన్ కార్డు
భారీ వర్షం.. సిక్కోలు జలమయం
- ఎక్కడికక్కడే నిలిచిన వర్షపునీరు
8లో
'సేవా దృక్పథం కలిగి ఉండాలి' 9లో



వంచించి.. కాటేసి!

- జిల్లాలో అధికమవుతున్న అఘాయిత్యాలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు
- బ్యాడ్‌టచ్.. గుడ్‌టచ్‌పై అవగాహన తప్పనిసరి

- గత ఏడాది పలాసలో ఓ బాలికపై ముగ్గురు యువకులు అత్యాచారం చేశారు. పుట్టినరోజు వేడుకలని పిలిచి మాయమాటలు చెప్పి ఇంటి నుంచి బయటకు తీసుకెళ్లారు. కూల్‌డ్రింక్‌లో మత్తు కలిపి ఇచ్చారు. మత్తులో జారుకున్న ఆ బాలికపై అత్యాచారం చేశారు. కొద్దిసేపటి తర్వాత జరిగిన అఘాయిత్యం గుర్తించి బాధిత బాలిక తల్లిదండ్రులకు వివరించింది. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు.

- ఈ ఏడాది మార్చిలో శ్రీకాకుళంలోని బాకర్ సాహెబ్‌పేటలో దారుణం చోటుచేసుకుంది. విజయవాడకు చెందిన 17ఏళ్ల బాలిక అమ్మమ్మ ఇంటికి వచ్చింది. ఆ ఇంటి ఎదురుగా ఉన్న యువకుడు బాలికపై కన్నేశాడు. మాయ మాటలు చెప్పి పలుమార్లు లైంగిక దాడి చేయడంతో బాలిక గర్భం దాల్చింది. బాలిక కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని గ్రహించి శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ వ్యక్తిపై సీఐ ఈశ్వరరావు పోక్సో కేసు నమోదు చేశారు.

- గత వారం విజయనగరం కంటోన్మెంట్ జంక్షన్‌కు చెందిన 14ఏళ్ల బాలికను శ్రీకాకుళం వాంబేకాలనీకి చెందిన ముగ్గురు యువకులు మాయమాటలు చెప్పి శ్రీకాకుళం నాగావళి రివర్‌వ్యూ పార్క్‌కు రప్పించి ఆమెపై అసభ్యకరంగా ప్రవర్తించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఓ మహిళ దీనిని గమనించి ఆ ముగ్గురు యువకులను మందలించింది. బాలిక తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారం అందించింది. వారు శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీసులకు ముందుగా ఫిర్యాదు చేసి తర్వాత కేసులు వరకు వెళితే తమ పరువు పోతుందని ఫిర్యాదును వెనక్కి తీసుకున్నారు.

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాలికలు, యువతులపై అఘాయిత్యాలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. కామాంధుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. చాక్లెట్లు ఇస్తాననిచెప్పి పక్కింటి వృద్ధుడు లోబర్చుకోవడం.. కొంతమంది పాఠాలు బోధించే రూపంలో ప్రైవేటు పార్టుల దగ్గర చేయవేయడం.. ఇంకొంత మంది బస్సుల్లో ప్రయాణించేటప్పుడు మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించడం వంటి ఘటనలు నిత్యం ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా బాలికలకు రక్షణ కరువవుతోంది. చిన్నారులపై లైంగిక దాడులకు సంబంధించి బాధ్యులను శిక్షించేందుకు పోక్సో చట్టం ఉన్నా ఆశించినస్థాయిలో అమలు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో మానవమృగాలు పేట్రేగిపోతున్నారు.

ఏటా పెరుగుతున్న కేసులు

జిల్లాలో అత్యాచారాలు, కిడ్నాపింగ్ కేసులు ఏటా పెరుగుతున్నాయి. 2023లో బాలికలు, మహిళలపై అత్యాచార ఘటనలకు సంబంధించి 39 కేసులు నమోదయ్యాయి. 2024లో 44 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాదిలో 8 నెలల కాలంలోనే 37 కేసులు నమోదు కావడం గమనార్హం. కేవలం ఇవి పోలీసుల వద్ద నమోదైన కేసులు మాత్రమే. వెలుగులోకి రాని ఘటనలు చాలా వరకు ఉన్నాయి. పరువు పోతుందని కొందరు, కేసులుబారిన పడతామని మరికొందరు ఇటువంటి కేసులపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకాడుతున్నారు.

అప్రమత్తత అవసరం

పిల్లల విషయంలో తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలి. ఎదిగే వయసులో కొన్ని - (మిగతా 8వ పేజీలో..)

అవగాహన పెంచేలా..



చిన్నారులపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. వారికి ప్రాథమిక స్థాయి నుంచే అన్ని విషయాలపై అవగాహన పెంచాలి. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన పెంపొందించుకోవడం చాలా ముఖ్యం. జిల్లాలో పోక్సో, నిర్భయ కేసులు కూడా అదుపులోకి వస్తున్నాయి. అఘాయిత్యాలు, నేరాల నియంత్రణపై విద్యా సంస్థల్లో దీనిపై మరింత అవగాహన పెంచే కార్యక్రమాలు చేపట్టాలి.

- సీహెచ్ వివేకానంద, డీఎస్పీ, శ్రీకాకుళం

పోక్సో చట్టం ఉన్నా..

బాలికలు, యువతులకు రక్షణగా పోక్సో చట్టాన్ని 2012లో ప్రవేశపెట్టారు. ఈ కేసు నమోదై రుజువైతే 20ఏళ్ల వరకు శిక్ష పడుతుంది. సామాన్యుల కంటే ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఇటువంటి తప్పు చేస్తే ఎక్కువ కాలం శిక్ష పడేలా దీనిని రూపొందించారు. కానీ నేరారోపణ, కేసులు నమోదు, ఆధారాలు సమర్పించడం వంటి వాటిలో వైఫల్యం ఎక్కువగా కనిపిస్తుంది. దీనితో చాలావరకు కేసులు నీరుగారిపోతున్నాయన్న విమర్శలున్నాయి. బాలికలు వేధింపులకు గురైతే పోక్సో. 18 ఏళ్ల పైబడిన యువతులు బాధితులైతే నిర్భయ చట్టం కింద కేసులు నమోదు చేస్తుంటారు. వీటి విషయంలో పోలీస్‌శాఖ ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది.


శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల కళాశాల ఆవరణలో కొత్త ఉపాధ్యాయులు

నేడు డీఎస్సీ నియామక పత్రాలు

- అమరావతికి పయనమైన కొత్త ఉపాధ్యాయులు

గుజరాతీపేట. సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు అమరావతిలో గురువారం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతులమీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ మేరకు జిల్లా నుంచి కొత్త ఉపాధ్యాయులు బుధవారం అమరావతికి ఆర్టీసీ బస్సుల్లో పయనమయ్యారు. జిల్లాలో ఎంపికైన ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, వ్యాయామ ఉపాధ్యాయులతో కలిసి 673మంది ఉన్నారు. వీరంతా సహాయకులతో కలిసి మొత్తం 1,568 మంది ఆర్టీసీ బస్సుల్లో పయనమయ్యారు. వీరి కోసం ప్రభుత్వ పురుషుల కళాశాల ఆవరణలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఒక బస్సుకు ముగ్గురు సహాయకులతోపాటు, పోలీసు భద్రత కూడా అధికారులు కల్పించారు.


బస్సుల్లో అమరావతికి పయనమవుతున్న కొత్త ఉపాధ్యాయులు

చేయి తడపాల్సిందేనా?

- కొన్ని శాఖల్లో పెరుగుతున్న అవినీతి
- కానీ ఫిర్యాదులు అంతంతమాత్రమే
- లంచం అడిగితే ఏసీబీని ఆశ్రయించాలి

- ఈ ఏడాది మార్చి 25న శ్రీకాకుళంలోని బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ బాలరాజు రూ.25వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీకి పట్టుబడ్డారు. ఓ బీసీ వసతిగృహంలో బిల్లుల కోసం మహిళా అటెండర్ అధికారిని కలవగా లంచం డిమాండ్ చేశారు. దీంతో ఆమె ఏసీబీ అధికారులను ఆశ్రయించింది.

....

- ఈ ఏడాది ఏప్రిల్ 3న శ్రీకాకుళం డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ, క్యాంప్‌క్లర్క్ సురేష్ రూ.25వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఓ పీహెచ్‌సీలో సీనియర్ అసిస్టెంట్ సెలవులో ఉండగా.. తిరిగి విధుల్లోకి చేర్చుకునేందుకు లంచం డిమాండ్ చేశారు. బాధితురాలు ఏసీబీని ఆశ్రయించింది. లంచం ఇస్తూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టించింది.

....

- ఈ ఏడాది మే 23న కాశీబుగ్గలో తూనికలు కొలతల శాఖ అధికారి శ్రీధర్ రూ.1.78 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. వ్యాపారుల ఎలక్ట్రికల్ కాటా సామర్థ్యం పరీక్షలకు గాను.. కాటాకు రూ.1000 డిమాండ్ చేయడంతో వ్యాపారులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో అవినీతి పెరిగిపోయింది. ప్రభుత్వం కఠిన చర్యలకు దిగుతున్నా నియంత్రణలోకి రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రధానంగా రెవెన్యూ, మునిసిపల్, పంచాయతీరాజ్, (మిగతా 8వ పేజీలో..)




బొడ్డేపల్లిలో ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న అధికారులు

ఇసుక ర్యాంపుపై దాడులు

- అక్రమ నిల్వలు కూడా పరిశీలన
- 17 వాహనాలు సీజ్

పొందూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పొందూరు మండలంలో అనధికార ఇసుక ర్యాంపులు, అక్రమ ఇసుక నిల్వలపై అధికారులు దాడులు చేశారు. మొత్తం 17 వాహనాలను సీజ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం బొడ్డేపల్లిలో ఇసుక ర్యాంపును, కింతలి నుంచి మొదలవలస వరకు ఇరువైపులా ఉన్న భారీ ఇసుక నిల్వలను జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు, మైనింగ్, విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. ఆ సమయంలో ఇసుకలోడులో ఉన్న మూడు భారీ టిప్పర్లు, పది ట్రాక్టర్లను అడ్డుకున్నారు. లారీలు, ట్రాక్టర్లలో ఇసుకను లోడ్ చేస్తున్న నాలుగు ప్రొక్లయినర్లను (మిగతా 8వ పేజీలో..)

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు
- విజేతలుగా విజయనగరం, కడప జట్లు
720 లీటర్ల సారా స్వాధీనం
- ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల్లో అధికారుల దాడులు
10లో



వైభవంగా కొత్తమ్మతల్లి శోభాయాత్ర

(ఏడో పేజీ తరువాయి)

పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, టెక్కలి ఆర్డీవో ఎన్.కృష్ణమూర్తి, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సతీమణి మాధవి తదితరులు ఢంకా మోగించి.. జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. నాదస్వరం, డోలు, మంగళ వాయిద్యాల నడుమ.. 30 రకాల సాంస్కృతిక ప్రదర్శనలతో శోభాయాత్ర నిర్వహించారు. అరసవల్లి, అన్నవరం, సింహాచలం దేవస్థానాల ఆలయ రథాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు నుంచి కొత్తపేట జంక్షన్ మీదుగా సుమారు మూడు గంటలపాటు యాత్ర సాగింది. చివరికి కోటబొమ్మాళి పెద్ద చెరువు వద్ద ముగిసింది. కోలాటం, దాండియా, పెద్దపాడు డప్పుల మోత, థింసా నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జముకుల పాట, కొమ్ము డాన్స్, ఒడిశా డప్పు డాన్సు, కేరళ డ్రమ్స్, చెక్కభజన, పులివేషాలు, కర్ర సాము, మహిళల డబ్బు డాన్స్, లేడీస్ తీన్మార్ వంటి సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ కోరాడ గోవింద్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెలమల విజయలక్ష్మి, టీడీపీ నాయకుడు తర్ర రామకృష్ణ పాల్గొన్నారు.



కొత్తపేటలో విద్యుత్ దీపాల అలంకరణ



ఘటాలతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు





అమ్మవారి వేషధారణలో...



ఆకట్టుకున్న డప్పు కళాకారులు



కుమార్తెను భుజాలపై ఎత్తుకుని నడుస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కన్నా... నిలపాలని ఎత్తులో నాకన్నా!

కోటబొమ్మాళి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఈ ప్రపంచంలో బిడ్డలకు తండ్రి భుజం కంటే ఎత్తయిన ప్రదేశం ఉండదు. తండ్రులకూ అంతే... బిడ్డలను భుజాలపై మోసినపుడు వారి కళ్లలో కనిపించే ఆనందం కంటే గొప్పగా ఏమీ కనిపించదు. ఢిల్లీకి రాజైనా బిడ్డ ముందు పసిపిల్లాడైపోతాడు. ఇదిగో అలాంటి అరుదైన దృశ్యానికి కొత్తమ్మతల్లి వేడుక వేదికైంది. నిత్యం అధికారులకు ఆదేశాలిస్తూ...తన పరివారానికి సూచనలు...సలహాలిస్తూ... విధి నిర్వహణలో క్షణం తీరిక లేకుండా ఉండే కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తండ్రి పాత్రలో పూర్తిగా ఒదిగిపోయారు. కోటబొమ్మాళిలోని కొత్తమ్మతల్లి ఉత్సవాలకు బుధవారం కలెక్టర్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. కొత్తపేట జంక్షన్ నుంచి తన కుమార్తెను భుజంపై ఎత్తుకొని... జనంతో పాటు సుమారు రెండు కిలోమీటర్లు నడిచి ఆలయం వద్దకు చేరుకున్నారు. కుమార్తెకు ఉత్సవాల విశేషాలను వివరిస్తూ... సాంస్కృతిక ప్రదర్శనలను చూపిస్తూ ముందుకు కదిలారు. ఓవైపు పోలీసులు.. మరోవైపు అధికారులు, సిబ్బంది ఉండగా... ఆ నడుమ కలెక్టర్ తన కుమార్తెతో నడిచి వెళ్లిన దృశ్యాన్ని చూసి భక్తులు ముచ్చటపడ్డారు.

హీరోయిన్ గీతాసైనీ సందడి

నరసన్నపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హీరోయిన్ గీతాసైనీ.. కోమర్తి, మడపాం గ్రామాల్లో బుధవారం సందడి చేశారు. స్థానికులతో కొద్దిసేపు ముచ్చటించారు. వారితో ఫొటోలకు ఫోజులిచ్చారు. పుష్పక విమానం, కన్యాకుమారి సినిమాల్లో గీతాసైనీ హీరోయిన్‌గా నటించారు. రెండేళ్ల కిందట కోమర్తి, మడపాం గ్రామాల పరిసరాల్లో జరిగిన కన్యాకుమారి షూటింగ్‌లో తాను పాల్గొన్నానని, ఈ చిత్రం విజయవంతం కావడంతో ఇక్కడకు వచ్చినట్లు ఆమె తెలిపారు. జిల్లా యాస, భాష, సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ఈ చిత్రాన్ని దర్శకుడు అట్టాడ సృజన్ తెరకెక్కించారని చెప్పారు. ఈ సినిమా తనకు ఎంతో ఆనందం ఇచ్చిందని పేర్కొన్నారు.



కోమర్తి గ్రామస్థులతో నటి గీతాసైనీ

విద్యార్థినులు ఇద్దరు.. బోధించేది ఒక్కరు

● ఇదీ హుకుంపేటలో పరిస్థితి

గార రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గార మండలంలోని హుకుంపేట ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు మాత్రమే ఉన్నారు. వారికి ఒక ఉపాధ్యాయుడు సోమేశ్వర రావు పాఠాలు బోధించాల్సి వస్తోంది. రెండేళ్ల కిందట ఈ పాఠశాలలో అయిదుగురు విద్యార్థు లు ఉండేవారు. వారిలో ఇద్దరు జిల్లా కేంద్రం లోని ఒక ప్రయివేటు పాఠశాలకు వెళ్లిపోయా రు. గత ఏడాది ముగ్గురు విద్యార్థులు పాఠశాల లో చదువుకోగా... వారిలో ఒకరు 6వ తరగతి కోసం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు పా ఠశాలకు వెళ్లిపోయారు. 3,4 తరగతులు చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు ప్రస్తుతం ఇక్కడ ఉన్నారు. గ్రామంలో ప్రాథమిక స్థాయిలో చదు వుతున్న విద్యార్థులు లేరని తల్లిదండ్రులు అం టున్నారు. ఉన్న ఇద్దరు విద్యార్థినులు రాకపో తే ఉపాధ్యాయుడు సోమేశ్వరరావు వారి ఇళ్ల కు వెళ్లి.. తీసుకొచ్చి పాఠాలు బోధిస్తున్నారు.

విద్యార్థినులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు



ఈ కార్డుతో.. ప్రయోజనాలెన్నో!


● వృద్ధులకు వరంగా సీనియర్ సిటిజన్ కార్డు

● పురుషులకు 60, మహిళలకు 58 ఏళ్లకు జారీ

● సచివాలయాల్లో దరఖాస్తులకు అవకాశం

కోటబొమ్మాళి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏటీఎం... పాన్.. ఆధార్ కార్డులతో అందరికీ పరిచయమే. బ్యాంకుల నుంచి డబ్బులు తీసుకోవ డం...ఆదాయం గణన... వ్యక్తిగత గుర్తింపు తదితర వాటికి ఇవి ఉపయోగపడుతున్నాయి. వీటితో పాటు మరో ముఖ్యమైన కార్డు ఉంది. అది 'సీనియర్ సిటిజన్ కార్డు'. దీనితో వృద్ధులకు బోలెడన్ని ప్రయోజనాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఎక్కడైనా సేవలు నిరాటంకంగా పొందవచ్చు. ప్రభుత్వ సంక్షేమ పథకాలనూ సులువుగా అందుకోవచ్చు. వృద్ధాశ్రమాల్లోనూ సేవలు పొందవచ్చు. ఇన్ని ప్రయోజనాలు ఉన్న ఈ కార్డును గ్రామ, వార్డు సచివాలయాలలో ఉచితంగా జారీ చేస్తున్నారు. కానీ ప్రచార లోపం వల్ల చాలా మంది తీసుకోవడం లేదు.





బోలెడు రాయితీలు

సీనియర్ సిటిజన్ కార్డు ఉంటే వృద్ధులకుఏ ఆర్టీసీ బస్సుల్లో టికెట్‌లో 25 శాతం రాయితీ లభిస్తుంది. దగ్గర ప్రాంతాలలో తిరిగే బస్సుల్లో రెండు రిజర్వ్ సీట్లు, రైళ్లలో లోయర్ బెర్త్‌ల కేటాయింపులో ప్రాధాన్యం ఉంటుంది. స్లీపర్ కోచ్‌లో ఆరు, థర్డ్ ఏసీలో నాలుగు, సెకెండ్ ఏసీలో మూడు బెర్త్‌లు రిజర్వ్ ఉంటాయి. కొత్త పాస్‌పోర్ట్ కోసం స్లాట్ బుకింగ్ ఫీజులో 10 శాతం తగ్గిస్తారు. బ్యాంకుల్లో ప్రత్యేక వరుస ఉంటుంది. డిపాజిట్లపై అదనపు వడ్డీరేటు లభిస్తుంది. ఆదాయ పన్నులో మినహాయింపు ఇస్తారు. న్యాయస్థానాల్లోనూ కేసుల విచారణ విషయంలో ప్రాధాన్యం ఉంటుంది. లేఖ రాసినా లేదా వారి తరఫున న్యాయవాది కోరినా ప్రత్యేక విచారణ తేదీలు కేటాయిస్తారు.

కార్డును ఎలా పొందాలంటే..

పురుషులకు 60, మహిళలకు 58 ఏళ్లు నిండితే సీనియర్ సిటిజన్ కార్డును ప్రభుత్వం మంజూరు చేస్తుంది. గ్రామ, వార్డు సచివాలయాలలో దరఖాస్తు చేసిన వారికి వారంలో కార్డు మంజూరవుతుంది. జిల్లా దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో వెంటనే పొందవచ్చు. దరఖాస్తుతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, వయసు ధ్రువీకరణ, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా తదితర పత్రాలను సమర్పించాలి.

దరఖాస్తుదారులకు ఇస్తున్నాం

కార్డు కోసం దరఖాస్తు చేసిన వెంటనే వార్డు, గ్రామ సచివాలయాల నుంచి వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల పరిశీలనకు వెళతుంది. అనుమతి రాగానే కార్డు జారీ చేస్తారు. కార్డు పొందడానికి ఆర్థిక పరిమితి లేదు.

- కె.ఫణీంద్రకుమార్, ఎంపీడీవో, కోటబొమ్మాళి

ఇసుక ర్యాంపుపై దాడులు

(ఏడో పేజీ తరువాయి)

స్వాధీనం చేసుకున్నారు. ర్యాంపు నిర్వాహకుల గురించి వాహనడ్రైవర్లను ప్రశ్నించారు. తాము కేవలం ఇసుకను మాత్రమే తీసుకెళ్తామని, లావాదేవీలన్నీ తమ వాహన యజమానులే చూస్తారని డ్రైవర్లు చెప్పారు. నిల్వల వద్ద, ర్యాంపులో లోడుల సమాచారంతో ఉన్న రికార్డులను జేసీ స్వాధీనం చేసుకుని అధికారులకు అప్పగించారు. ఇసుక నిల్వలు, ర్యాంపు నిర్వాహకులపై పోలీసులు కేసులు నమోదు చేసి.. వాహనాలను స్టేషన్‌కు తరలించారు. దాడుల్లో ఆర్డీవో సాయిప్రత్యూష, డీఎస్పీ వివేకానంద, మైనింగ్ డీడీ మోహనరావు, ఏడీ విజయలక్ష్మి, పొందూరు తహసీల్దార్ ఆర్.వెంకటేష్, ఎస్‌ఐ బాలరాజు పాల్గొన్నారు.

సిక్కోలు జలమయం

● ఎక్కడికక్కడే నిలిచిన వర్షపునీరు

అరసవల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి శ్రీకాకుళం నగరం జలమయమైంది. బుధవారం రాత్రి కురిసిన వర్షంతో నగరంలోని డే అండ్ నైట్ జంక్షన్, పాత బస్టాండు వద్ద గల పొట్టి శ్రీరాములు జంక్షన్, కిన్నెర్ థియేటర్, అరసవల్లి మిల్లు జంక్షన్ తదితర ప్రాంతాల్లో రోడ్డుపై వర్షపునీరు, కాలువల్లోని మురుగునీరు పొంగిపొర్లాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ వర్షపునీటితో నిండిపోయి చెరువును తలపించింది. ఇందిరానగర్ కాలనీ, శ్రీరామ్‌నగర్, నగర శివారు కాలనీల్లో నీరు రోడ్డుపై ప్రవహించింది. లోతట్టు ప్రాంతాలు జలమ యమయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

అరసవల్లి మిల్లు జంక్షన్ వద్ద జలమయమైన రోడ్డు



అమృత్ నిధుల దుర్వినియోగం

అసెంబ్లీలో మన వాణి

● ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ప్రభుత్వం అమృత్ 2.0 పథకం ద్వారా మంజూరు చేసిన నిధులను అధికారులు చేసిన స్కాంతో దుర్వినియోగం జరిగినట్టు రాష్ట్ర పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ బుధవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం ఈ పథకం ద్వారా మున్సిపాలిటీలకు మంజూరు చేసిన నిధులను పనులు చేయకుండా అధికారులు, కాంట్రాక్టర్లు ఖర్చులు చూపించి.. అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. మాజీ సీఎం జగన్ తాడేపల్లి ప్యాలెస్, పులివెందుల కార్పొరేషన్, విశాఖపట్నం, రుషికొండ, విజయవాడ విమానాశ్రయంతో పాటు వివిధ ప్రాంతాల్లో సుమారు రూ.120 కోట్ల వరకు నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టడంతో పాట అవినీతి లెక్కలను సభలో ప్రవేశపెట్టాలని కోరారు.



మాట్లాడుతున్న రవికుమార్

చిత్తశుద్ధితో పనిచేసే వారికి మంచి భవిష్యత్తు

● సిక్కోలు మహిళలతో సీఎం చంద్రబాబు

అరసవల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నిజాయితీతో కష్టపడి పనిచేసే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులు బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలుసుకున్నారు. వారు నియోజకవర్గంలో చేస్తున్న కృషిని చంద్రబాబుకు ఎమ్మెల్యే శంకర్ వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ నిజాయితీతో పార్టీ కోసం పని చేయాలని... తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని చెప్పారు. ముఖ్యమంత్రిని కలిసినందుకు మహిళలందరూ ఆనందం వ్యక్తం చేశారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎమ్మెల్యే శంకర్, టీడీపీ మహిళా నాయకులు

చేయి తడపాల్సిందేనా?

(ఏడో పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్లు, పోలీస్ శాఖల్లో ఎక్కువ అవినీతి జరుగుతోంది. ప్రజల్లో అవగాహన, చైతన్యం లేకపోవడం, ఏసీబీలో సిబ్బంది కొరత.. లంచావతారులకు వరంగా మారుతోంది. రెవెన్యూ శాఖలో కొంతమంది అధికారులు, సిబ్బందికి మామూళ్లు ఇవ్వనిదే పనులు పూర్తికావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రైతులకు పాసుపుస్తకాలు, టైటిల్‌డీడ్, సర్వే, ఆన్‌లైన్‌లో భూమి వివరాలు నమోదు, ధ్రువపత్రాల జారీ, ఇసుక రవాణా తదితర వ్యవహారాల్లో ఎక్కువగా అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ప్రతి మండలంలోనూ ఇదే పరిస్థితి. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల విషయంలో కూడా అధికారులు, సిబ్బంది వాటాలు అడుగుతున్నారు. ఫలితంగా పనుల నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే టౌన్ ప్లానింగ్ గురించి చెప్పనవసరం లేదు. ఇంటి నిర్మాణాలకు సంబంధించి ప్లాన్ అప్రూవల్, అసెస్‌మెంట్ తదితర పనులకు సంబంధించి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా చాలామంది పోనీలే అని ఫిర్యాదు చేయకుండా వదిలేస్తున్నారు. ప్రజలకు సేవలు అందించేందుకే ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఉన్నారన్న విషయం కొంతమంది గ్రహించడం లేదు. పనులను త్వరితగతిన పూర్తిచేయించుకోవాలన్న ఆతృతతో కొంతమంది ప్రజలే లంచాన్ని ప్రోత్సహిస్తుంటారు. ఈ విషయంలో ప్రజలు చైతన్యవంతంగా ఉండాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. సామాజిక బాధ్యతగా అవినీతి నిర్మూలనకు సహకరించాలని చెబుతున్నారు. లంచం అడిగిన వెంటనే ఏసీబీకి ఫిర్యాదు చేయాలని స్పష్టం చేస్తున్నారు.

మనమే పట్టించొచ్చు..

ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఆలోచించకూడదు. మనమే అధికారులు, ఉద్యోగుల అవినీతిని బయటపెట్టొచ్చు. ప్రస్తుతం ప్రతి ఒక్కరి వద్ద స్మార్ట్ ఫోన్లు ఉన్నాయి. ఎక్కడైనా అవినీతి భాగోతాలు జరిగితే వీడియోలు, ఫొటోలు తీసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయాలి. మన జిల్లాకు సంబంధించి విజయనగరంలో కార్యాలయం ఉంది. ఆపై టోల్‌ఫ్రీ నంబర్ 14400కు సైతం ఫిర్యాదు చేయవచ్చని ఏసీబీ అధికారులు చెబుతున్నారు.

వంచించి.. కాటేసి!

(ఏడో పేజీ తరువాయి)

విషయాలు ఖచ్చితంగా నేర్పించాలి. ముఖ్యంగా గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి వివరించాలి. ఏ స్పర్శ ఎలాంటిది, ఎవరు ఎక్కడ తాకితే అభ్యంతరం చెప్పాలనేది పిల్లలకు వివరించాలని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలకు రెండు లేదా మూడేళ్ల వయసు నుంచే గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి వివరించాలని స్పష్టం చేస్తున్నారు. శరీర అవయవాలను ఎక్కడ తాకితే తప్పు అనే విషయాన్ని బొమ్మల ద్వారా వివరిస్తే చిన్నారులకు త్వరగా అర్థమవుతుందని చెబుతున్నారు. ఇలా చెప్పడం వల్ల పిల్లలు ఎప్పుడైనా అసౌకర్యానికి గురైనప్పుడు వెంటనే అక్కడ నుంచి బయటపడడానికి చూస్తారు. తద్వారా ఏం జరిగిందన్నది తల్లిదండ్రులకు తెలుస్తుందని పేర్కొంటున్నారు. 'పిల్లలకు ఎలా ధైర్యంగా ఉండాలో కూడా తల్లిదండ్రులు నేర్పించాలి. పాఠశాలలు, కళాశాలలు, బయట జరుగుతున్న అన్ని విషయాలు పిల్లలు చెప్పుకునేలా తల్లిదండ్రులు స్వేచ్ఛను కల్పించాలి. నీకేం కాదు.. అంతా మేం చూసుకుంటాం అనే భరోసా పిల్లలకు అందిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఇలా చెప్పడం ద్వారా నేరాలకు అవకాశం ఇవ్వకుండా చూసిన వారవుతామ'ని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

మినీ అంగన్‌వాడీలకు తీపికబురు!

(ఏడో పేజీ తరువాయి)

చేశారు. మరోవైపు సమస్యల పరిష్కారానికి సమ్మెబాట కూడా పట్టారు. అయినా ఫలితం లేకపోయింది. కూటమి ప్రభుత్వం స్పందించి మినీ అంగన్‌వాడీలను ప్రధాన కేంద్రాలుగా గుర్తించడంతోపాటు ఆయా పోస్టులు కూడా భర్తీ చేసేలా చర్యలు చేపడుతోంది. చిన్నారులతో సంబంధం లేకుండా పదో తరగతి ఉత్తీర్ణత అయిన ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త ఉన్న కేంద్రాన్ని మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంగా గుర్తిస్తున్నట్టు ఉత్తర్వులు జారీచేసింది.

జిల్లాలో 2,786 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు, 599 మినీ కేంద్రాలు ఉన్నాయి. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు జిల్లాలో 446 మినీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చనున్నామని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్నామని తెలిపారు. 153 మంది కార్యకర్తలు పదోతరగతి ఉత్తీర్ణత కాకపోవడంతో మినీ అంగన్‌వాడీ కేంద్రాలుగా మిగిలిపోయాయని పేర్కొన్నారు. మిని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటివరకూ ఒక్కో కార్యకర్త మాత్రమే ఉండేవారు. ప్రభుత్వం అప్పగించిన సర్వేలు, ఇతర కార్యక్రమాల నిర్వహణ భారంగా ఉండేది. పిల్లలకు ఆలనాపాలనా, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ ఒక్కరూ చూడాల్సి వచ్చేది. వేతనం కూడా తక్కువ. ప్రభుత్వం వీటిని ప్రధాన కేంద్రాలు మార్పు చేయనుండడంతో అంగన్‌వాడీ కార్యకర్తల్లో హర్షం వ్యక్తమవుతోంది. అలాగే పదిమంది చిన్నారులు కన్నా తక్కువగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పక్క కేంద్రంలో విలీనం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై మెళియాపుట్టి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అమరావతి వద్ద ప్రస్తావించగా.. 'ప్రభుత్వ ఆదేశాల మేరకు మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా గుర్తించాం. కార్యకర్తలకు రూ.11,500 చొప్పున వేతనాలు అందజేస్తామ'ని తెలిపారు.

అంధురాలికి యంత్రాంగం బాసట



వృద్ధురాలితో మాట్లాడుతున్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది

పొందూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పొందూరు పట్టణంలోని వాండ్రంగి వీధికి చెందిన అంధురాలైన వృద్ధురాలు కుమరాపు తవిటమ్మకు అధికార యంత్రాంగం బాసటగా నిలుస్తోంది. ఈమెకు చెందిన స్థలాన్ని మరో మహిళ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వైనాన్ని 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం 'అంధురాలిపై కనికరం లేదా?' శీర్షికతో కథనం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాలతో బుధవారం రెవెన్యూ, పోలీసు సిబ్బంది వృద్ధురాలిని కలిసి సమస్యను తెలుసుకున్నారు. ఆమె వద్ద ఇంటికి చెందిన పత్రాలను పరిశీలించారు. ఈ మేరకు కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని తహసీల్దార్ ఆర్.వెంకటేష్ తెలిపారు. వృద్ధురాలికి అండగా ఉంటామని చెప్పారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీలకు పేర్లు నమోదు చేసుకోండి

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు నిర్వహిస్తోందని, దీనికి పేర్లు నమోదు చేసుకోవాలని యువభారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే పేర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని అక్టోబరు 31లోగా నమోదు చేసుకోవచ్చన్నారు. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాలల్లోని విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొనడానికి అర్హులన్నారు. దేశవ్యాప్తంగా ఈ పోటీల ద్వారా 10 వేల మంది యువతను ఎంపిక చేసి వారికి వివిధ స్థాయిల్లో బహుమతులు అందజేయనున్నారన్నారు. ఈ క్విజ్ పోటీల్లో మన్‌కీబాత్‌లో ప్రధాని ప్రస్తావించిన అంశాలు, 2014 నుంచి దేశం సాధించిన విజయాలు, ఘనత, ఒబెసిటీపై అవగాహన, మాదక ద్రవ్యాల నిర్మూలన, ఆత్మ నిర్భర భారత్, వోకల్ ఫర్ లోకల్ అంశాలపై ప్రశ్నలుంటాయన్నారు. 2025 సెప్టెంబరు ఒకటి నాటికి 15 నుంచి 29 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలని, మైభారత్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ అయి ఉండి ఈ లింకు ద్వారా ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


కార్యాలయ ఏవోకు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ నేతలు కోరారు. ఈ మేరకు బుధవారం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మండల పరిషత్ కార్యాలయ ఏవో రామారావుకు అందించారు. సచివాలయ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. డోర్ టూ డోర్ సర్వీసెస్ రద్దు చేసి సహకరించాలని కోరారు. పారదర్శక బదిలీలన్ని డిపార్ట్‌మెంట్లకు జాబ్‌చార్ట్ క్రియేట్ చేసి ప్రమోషన్ చానల్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సచివాలయ ఉద్యోగుల సంఘం కోఆర్డి నేటర్ పి.అశోక్, ఎస్.ప్రవీణ్, జోగమ్మ, ఉమా, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు తప్పవు


మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం లీగల్, సెప్టెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేర మని, ఎవరైనా వాటిని చేస్తే చర్యలు తప్పవని జిల్లా న్యాయసేవాధి కార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. సంస్థ కార్యాలయంలో బుధవారం మత పెద్దలు, ఫొటోగ్రాఫర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా, వెనుకబడిన కొన్ని సామాజిక వర్గాల్లో ఇప్పటికీ బాల్య వివాహాలు జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు మత పెద్దలు కృషి చేయాలన్నారు. బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం పూర్తిగా పాడయ్యే అవకాశం ఉందన్నారు. బాల్య వివాహాలు చేసే మత పెద్దలు కూడా చట్టరీత్యా శిక్ష ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి కేవీ రమణ, న్యాయవాదులు ఇందిరా ప్రసాద్, కె.ఆఫీస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే సహించేది లేదు

రణస్థలం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం కోసం చేపడుతున్న అనేక కార్యక్రమాలను చూసి ఓర్వలేక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుపై ప్రతిపక్ష నేతలు చేస్తున్న ఆరోపణలను సహించేది లేదని కూటమినేతలు హెచ్చరించారు. బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ చేసిన ఆరోపణలను ఖండించారు. ఎవరు నీతిపరులో, ఎవరు అవినీతిపరులో ప్రజలకు తెలుసన్నారు. గ్రావెల్, ఇసుక వంటి అక్రమ వ్యాపారాలు ఎవరు చేస్తున్నారో ప్రజలకు తెలియనది కాదన్నారు. సమావేశంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పిస్నింటి భానోజీరావు నాయుడు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము, టీడీపీ మండల అధ్యక్షుడు లంక శ్యామలరావు, మండపాక కనకారావు, సర్పంచ్ రౌతు శ్రీనివాసరావు, పినిసి జగన్నాథంనాయుడు, బీజేపీ లావేరు, రణస్థలం మండలాల అధ్యక్షులు లుకలాపు అప్పల నాయుడు, మహంతి అనంత్ తదితరులు పాల్గొన్నారు.

భవానీ భక్తుల పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న భవానీభక్తులు

రణస్థలం, సెప్టెం బరు 24 (ఆంధ్రజ్యోతి): నారువ గ్రామం రామాలయం నుంచి శ్రీకూర్మం దేవాలయానికి స్థానిక భవానీ మాలధారణ భక్తులు బుధవారం పాదయాత్ర చేపట్టారు. దేవీ శరన్నవరాత్రి సందర్భంగా నిద్రబంగి రామకృష ఆధ్వర్యంలో 30 మంది పాల్గొన్నారు.

దసరా పండుగకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

అరసవల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా దూర ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు వచ్చే, వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం జిల్లా పరిధిలోని నాలుగు ఆర్టీసీ డిపోల నుండి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డీపీటీవో అప్పలనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు సుమారు 480 ప్రత్యేక బస్సులను ఎటువంటి అదనపు చార్జీలు లేకుండా నడుపుతున్నామన్నారు. జిల్లా నుంచి హైదరాబాద్, విజయవాడ, అమలాపురం, రాజమండ్రి, కాకినాడలకు నడుపుతున్నామన్నారు. విజయవాడ వెళ్లేందుకు భవానీ భక్తులు కోరిన విధంగా ప్యాకేజీ బస్సులు ఏర్పాటు చేస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

సేవా దృక్పథం కలిగి ఉండాలి


ఆర్జీయూకేటీలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి ప్రొఫెసర్ ఎం.సుధాకర్

ఎచ్చెర్ల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్లు సేవాభావం కలిగి ఉండి దేశ ప్రగతిలో భాగస్వామ్యం కావాలని ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి డాక్టర్ ఎం.సుధాకర్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లలో బుధవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే సేవాభావం, సామాజిక బాధ్యత, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని, ఇదే ఉద్దేశంతో ఎన్ఎస్ఎస్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమాల్లో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, పూర్వపు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ఎన్‌వైకే ఉప సంచాలకుడు కె.వెంకట ఉజ్వల్,


ఎన్ఎస్ఎస్ అక్షరాకారంలో విద్యార్థినులు

ఎన్‌వైకే కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ, బెజ్జిపురం యూత్‌క్లబ్ డైరెక్టర్ ఎం. ప్రసాదరావు, వర్సిటీ ప్రిన్సిపాళ్లు ఎం.అనూరాధ, సీహెచ్ రాజశేఖరరావు ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో డాక్టర్ ముని రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.ముకుందరావు, డీన్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే..

కవిటి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశనుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ కె.సింహాచలంనాయుడు అన్నారు. కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. చదువుతోపాటు సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పౌరులుగా మారాలని, దీనికి ఎన్ఎస్ఎస్ దోహదపడుతుందన్నారు. అలాగే ఫ్రెషర్స్ డే నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.లక్ష్మణరావు, నేతలు ఎ.మధు, వి.రంగారావు, ఎ.రాజు, బి.తిరుమలరావు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ నిమజ్జనం

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చంపాగల్లి వీధిలో విశ్వకర్మ భగవానుని పంచమ పూజ మహోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేసి ప్రత్యేక వాహనంపై ఊరేగింపు నిర్వహించి నిమజ్జనోత్సవం చేశారు. కార్యక్రమంలో పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు సోపింటి తారకేశ్వరరావు, కార్యదర్శి కడారి దుర్గాప్రసాద్, తాళాబత్తుల సూరి ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

సోంపేట/సోంపేట రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేటు ఎరువుల దుకాణాన్ని వ్యవసాయ శాఖ ఏడీ టి.భవానీ శంకర్, ఏవో బి.నరసింహమూర్తి బుధవారం తనిఖీ చేశారు. స్టాకు, అమ్మకాల వివరాల రికార్డులను పరిశీలించారు.

లే అవుట్లు రెగ్యులరైజ్ చేసుకోవాలి

కవిటి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో వేసిన లేఅవుట్లు తప్పనిసరిగా రెగ్యులరైజ్ చేసుకోవాలని సుడా ప్లానింగ్ అధికారి డి. అమరనాథ్ అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎల్.ఆర్.ఎస్ పథకం ప్రాముఖ్యతను వివరిస్తూ పథకం అమలుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయాలి

జి.సిగడాం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలని డీఎల్‌డీవో అరుంధతి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వో లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో హక్కు పత్రాలను పంపిణీ చేయా లన్నారు.

మహిళలకు మెరుగైన వైద్యం లక్ష్యం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణ

సరుబుజ్జిలి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):మహిళలకు మెరుగైన వైద్యం అందించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాయని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. 'స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్'లో భాగంగా షలంత్రి గ్రామంలో వైద్యాధికారి సాహితీ ప్రియదర్శిని ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.వరలక్ష్మి, సీహెచ్‌వో మోహన్‌రావు, సూపర్‌వైజర్ మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్త్రీలకు అన్ని రకాల వైద్యసేవలు: డీఎంహెచ్‌వో


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డా.కె.అనిత

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్త్రీలకు వివిధ రకాల వైద్యసేవలు అందిస్తున్నా మని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో డా.కె.అనిత అన్నారు. బుధవారం వాకలవలస గ్రామంలో 'స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలతో పాటు వివిధ పరీక్షలు నిర్వ హిస్తున్నా మని, వీటిని వినియో గించుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి లిల్లీ నిమ్మకాయల ఆధ్వర్యంలో మహిళలకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి



జ్యూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న కమిషనర్ ప్రసాదరావు

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంతో పాటు దేవాలయాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు అన్నారు. బుధవారం స్థానిక విజయగణపతి ఆలయం వద్ద లయన్స్‌క్లబ్, హర్షవల్లి విభాగం ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. నగరం పరిధిలోని ఇళ్లలో హరితభరిత వాతావరణం కల్పించాలని, దీనికి కృషి చేసే ఇంటి యజమానికి హరితమిత్ర పేరుతో ప్రతి ఏటా జనవరిలో నగదు పురస్కారం, ప్రశంసాపత్రం అందిస్తామన్నారు. అనంతరం ఆదాయపన్నుల శాఖ కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఇన్‌కంటాక్స్ ప్రధాన అధికారి రవికుమార్, శ్రీకాకుళం లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర, సెక్రటరీ టెక్కం రాంగోపాల్, హర్షవల్లి లయన్స్ క్లబ్ ప్రతినిధులు మణిశర్మ, సుమన్, గోపి, ఎం. మాధవి, బాలాజీ, పలువురు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గాజులకొల్లివలస సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న వివిధ గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త ఫీడర్లు ఏర్పాటు, చెట్టుకొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపడుతున్నందున ఆరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. అందువల్ల గాజులకొల్లి వలస, చిన్నజొన్నవలస, మునగవలస, అక్కులపేట, రామచంద్రాపురం, పొన్నాంపేట, చిట్టివలస, సైలాడ, దన్నానపేట తదితర గ్రామాలలో విద్యుత్ ఉండదని వినియోగదారులు గమనించాలని కోరారు.

భోజన పథకం మెనూ చార్జీలు పెంచాలి



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మహాలక్ష్మి

అరసవల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలని మధ్యాహ్న భోజన పథకం యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగమణి డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా 6వ మహాసభ బుధవారం యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మిడ్‌డేమీల్ పథకంలో పనిచేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.10 వేలు అందించాలన్నారు. ప్రమాదబీమా, పదవీ విరమణ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో వంట షెడ్లు, వంట పాత్రలు, తాగునీరు, గ్యాస్ సరఫరా తదితర సదుపాయాలు కల్పించాలని కోరారు. రానున్న రోజుల్లో కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపట్టాలని తీర్మానించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వీ రమణ, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కల్యాణి, కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

28న జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

నరుబుజ్జిలి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు జిల్లా వెయిట్ లిఫింగ్ సంఘం కార్యదర్శి కొత్తకోట శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. యంగ్‌స్టార్ యూత్ క్లబ్, పొందూరు ఎన్‌వైకే అనుబంధ సంస్థ రూరల్ స్పోర్ట్స్ క్లబ్ స్వర్ణోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నా మన్నారు. జిల్లా స్థాయి పోటీలు సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తున్నామని ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్‌కార్డు, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, బర్త్ సర్టిఫికెట్‌తో ఆదివారం ఉదయం 8 గంటలకు పొందూరులో నెహ్రూ పార్క్ వద్ద హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 95507 48966 నెంబరులో సంప్రదించాలన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి సాయం

రణస్థలం, సెప్టంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొండములగాం గ్రామానికి చెందిన పిన్నింటి రాజేశ్వరి కొన్ని రోజులుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండడంతో లాస్య ఫౌండేషన్ సభ్యులు బుధవారం రూ. 20వేలు సాయం బుధవారం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు విష్ణుమూర్తి, అప్పలనాయుడు, సత్తిబాబు, స్వామినాయుడు, సందీప్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రక్తదానంతో ప్రాణదానం

ఆమదాలవలస, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో రక్తం అవసరమవుతున్నందున ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాల్ అన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా సేవా పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, నాయకులు అట్టాడ రవిబాబ్జీ, బిర్లంగి ఉమామహేశ్వరరావు, పాతిన గడ్డెయ్య, నియోజకవర్గ కన్వీనర్లు పేడాడ రామ్మోహన్, సూరప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయండి

ఆమదాలవలస, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పీ-4 సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని మునిసిపల్ కమిషనర్ తమ్మినేని రవి అన్నారు. బుధవారం కార్యాలయంలో సర్వేకి సంబంధించి సచివాలయ సెక్రటరీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీ-4 సర్వే యాప్‌లో కనిపించే లబ్ధిదారులను గుర్తించి ఇంటింటికి వెళ్లి వారి పేదరిక స్థితిని నిర్ధారించాలన్నారు. అర్హులైన వారికి విద్య, వైద్యం, ఇతర సేవలు అందేలా మార్గదర్శి నిబంధనలు మేరకు సంబంధిత యాప్‌లో మ్యాపింగ్ చేయాలన్నారు. సమావేశంలో ఏఈ జాన్సన్, సీనియర్ అసిస్టెంట్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

కంచిలి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే పీ-4 లక్ష్యమని, దీనిని పకడ్బందీగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి కె.అప్పలస్వామి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పీ4పై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. బంగారు కుటుంబాలకు ఆర్థికంగానే కాకుండా విద్య వైద్యం, మౌలిక సదుపాయాల పరంగా సహకారం అందించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. ఎంపీడీవో వి.తిరుమలరావు, ఏపీవో జి. ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.











720 లీటర్ల సారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారాతో ఇరురాష్ట్రాల ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

పాతపట్నం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాలు సింగుపూర్, నేరేడిగూడ, శిరడాగూడ, గురిసింగిగూడ, దిదింగూడల్లోని సారా తయారీ కేంద్రాలపై అంతర్రాష్ట్ర ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖాధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. 6,800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 720లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు ఆశాఖ పాతపట్నం సీఐ కోట కృష్ణారావు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్ పి.రామచంద్రరావు, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖాధికారి సీహెచ్ తిరుపతినాయుడు, ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఉమ్మడిదాడులు చేపట్టినట్లు చెప్పారు.

కారు ఢీకొని వృద్ధురాలికి గాయాలు

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని వృద్ధురాలికి గాయాలైన ఘటనలో బుధవారం డ్రైవర్‌పై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నగరానికి చెందిన పట్నాన జానీ అనే వృద్ధ మహిళ కాళ్లు సరిగ్గా పనిచేయకపోవడంతో మంగళవారం రాత్రి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ రహదారి నుంచి ఏడురోడ్ల జంక్షన్ వద్దకు డేకురుకుంటూ వెళుతోంది. అయితే కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడిపిన కనిమేరక చలపతిరావు ఆమెను ఢీకొన్నాడు. దీంతో ఆమెకు గాయాలు కాగా స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కారు నడుపుతున్న చలపతిరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

నందిగాం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం గ్రామంలో తమ్మినేని మాదన్న, బగాది రామలక్ష్మి కుటుంబాల మధ్య మంగళవారం ఘర్షణ చోటు చేసుకోవడంతో ఇరువర్గాలు దాడి చేసుకున్నాయి. మాదన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై, రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకరిపై బుధవారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ కె.చిన్నారావు తెలిపారు.

గంజాయి అక్రమ రవాణా కేసులో

నిందితుడికి నాలుగేళ్ల జైలుశిక్ష

టెక్కలి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా కేసులో బుడుమూరు నాగరాజు అనే వ్యక్తికి నాలుగేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ శ్రీకాకుళం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి పి.భాస్కరరావు బుధవారం తీర్పు వెల్లడించారని టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు తెలిపారు. 2023 జనవరి 1న టెక్కలి జగతిమెట్ట సర్వీస్ రహదారిపై పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా, నాగరాజు తన ద్విచక్ర వాహనంపై ఒడిశా రాష్ట్రం చీకటి గ్రామం నుంచి గంజాయిని జిల్లాలోకి తీసుకు వస్తుండగా అప్పటి టెక్కలి ఎస్ఐ ఎల్.రామకృష్ణకు పట్టుబడ్డాడు. నాగరాజు నుంచి రూ.27,500 విలువగల 5కేజీల 450 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి సీఐ సూర్యచంద్రమౌళి కేసు దర్యాప్తు చేశారు. ఈ కేసును స్పెషల్ పీపీ కింజరాపు శ్రీనివాసరావు వాదించారు. నేరం రుజువు కావడంతో నాగరాజుకు కోర్టు జైలు శిక్ష విధించినట్లు డీఎస్పీ తెలిపారు. రూ.10వేల జరిమానా చెల్లించని యెడల ఆరు నెలల పాటు సాధారణ జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయాధికారి తీర్పులో పేర్కొన్నారు. అప్పటి సీఐ సూర్యచంద్రమౌళి, ఎస్ఐ రామకృష్ణ, కేసు వాదించిన పీపీ శ్రీనివాసరావు, కోర్టు లైజనింగ్ అధికారి గోవిందరావులను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అభినందించారు.

'సౌకర్యాలు కల్పిస్తేనే ఆశీలు చెల్లిస్తాం'

టెక్కలి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): చేపల మార్కెట్‌లో సౌకర్యాలు కల్పిస్తేనే తాము ఆశీలు చెల్లిస్తామని పలువురు మత్స్యకార మహిళలు అన్నారు. బుధవారం చేపల మార్కెట్‌లో ఆశీలు వసూలు చేసేందుకు వెళ్లిన ఓ వ్యక్తిని వారు నిలదీశారు. ఇక్కడ నీరు లేదని, లైట్లు వెలగడం లేదని.. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని అన్నారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తే పంచాయతీకి ఆశీలు చెల్లించడానికి తమకు అభ్యంతరం లేదని పేర్కొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో నైపుణ్యాభివృద్ధి

హరిపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యా కోర్సులతో విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి సాధ్యమవుతుందని ఒకేషనల్ ట్రైనర్స్ శ్రవణ్‌కుమార్, సురేష్ అన్నారు. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా మందస మండలం హరిపురం ప్లస్‌టూ హైస్కూల్‌లో పది, ఇంటర్ విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. పది రోజులు పాటు విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులపై అవగాహన కల్పించనున్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు అండగా సమతా సైనిక్ దళ్



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నరసన్నపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాలకు అండగా సమతా సైనిక్ దళ్‌ను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఏర్పాటు చేశారని రాష్ట్ర విద్యమౌలిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్ పీఎంజే బాబు అన్నారు. బుధవారం స్థానిక బండివీధిలో సమతాసైనిక్ దళ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బడుగు బలహీన వర్గాల కోసం సైనిక్ దళ్ పనిచేస్తుందని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఐతమ్‌లో వర్క్‌షాప్

టెక్కలి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఐతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం వర్క్‌షాప్ ప్రారంభమైనట్లు కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. ద్వితీయ సంవత్సర ఈఈఈ విద్యార్థులకు రెండు వారాల పాటు పీసీబీ డిజైన్‌పై శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఏపీఎస్ఎస్‌డీసీ ట్రైనర్ ఎస్కే రుబీనా, శ్రీమహిధర్ పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏఎస్ శ్రీనివాసరావు, ఈఈఈ విభాగాధిపతి డి.విజయ్‌కుమార్, స్పాక్ బి.రామారావు, విభాగ కో-ఆర్డినేటర్ జి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- అన్నపూర్ణదేవిగా అమ్మవారు దర్శనం

జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడోరోజు బుధవారం అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పలుచోట్ల దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు, భజనలు, అభిషేకాలు నిర్వహించారు. పాతపట్నం నీలమణి, శ్రీముఖలింగం భీమేశ్వరాలయంలోని మూడు ముఖాల అమ్మవారు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. శ్రీముఖలింగం ఆలయంలోని వారాహి అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. -ఆంధ్రజ్యోతి బృందం



ఎచ్చెర్ల: కుంచాలకురమయ్యపేట దుర్గాదేవి ఆలయంలో కుంకుమ పూజలు



వజ్రపుకొత్తూరు: అక్కుపల్లిలో..



ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



హిరమండలం: సుభలయ్ ఆర్‌ఆర్ కాలనీలో..



మెళియాపుట్టి:కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



పాతపట్నం: అన్నపూర్ణదేవిగా నీలమణిదుర్గ



జలుమూరు: అన్నపూర్ణగా మూడు ముఖాల అమ్మవారు



కవిటి: గొండ్యాలపుట్టుగలో గిరీష్‌కుమార్ రూపొందించిన భూలోకమాత సైకత శిల్పం



శ్రీకాకుళం కల్చరల్: ఉమారుద్ర కోటేశ్వరాలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అదనపు తరగతి గదులు నిర్మించండి



పీడీకి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే శిరీష

పలాస/వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి, మందస మండలం డిమిరియా పాఠశాలల్లో అదనపు తరగతి గదులు నిర్మించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర సర్వశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారని, కానీ సరిపడ గదులు లేక వారు ఇబ్బందులు పడుతున్నట్లు ఆమె వివరించారు. తన వినతిపై పీడీ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

డిమిరియా వంతెన పరిశీలన



వంతెనను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ అధికారులు

హరిపురం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మందస- డిమిరియా రోడ్డులో సునాముది కాలువపై ఉన్న వంతెనను పంచాయతీరాజ్ అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ వంతెన శిథిలావస్థకు చేరుకుందని, కూలిపోతే తమ గ్రామానికి రాకపోకలు నిలిచిపోతాయని డిమిరియా గ్రామస్థులు ఇటీవల ఎమ్మెల్యే శిరీష దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే సూచనతో అధికారులు వంతెనను పరిశీలించి అంచనాలు తయారు చేశారు. నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పీఆర్ డీఈఈ జి.రవికుమార్, టీడీపీ నాయకులు బావన దుర్యోధన, ముంజేటి చంద్రశేఖర్, రట్టి లింగరాజు, పల్లి చంద్రయ్య, కె.గోపాలు, లోకనాథం పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

కొత్తూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు సక్రమంగా అందించాలని ఆకులతంపర సెక్టార్ సూపర్‌వైజర్ జి.జానకమ్మ అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. బుధవారం ఆకులతంపర అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహా ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న పోషక విలువలతో కూడిన ఆహారాన్ని గర్భిణీలు, బాలింతలు, ప్రీస్కూల్ పిల్లలకు అందించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పీ-4 కార్యక్రమానికి సహకరించాలి

పలాస, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీ-4 కార్యక్రమానికి సచివాలయ ఉద్యోగులు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. బుధవారం మునిసిపల్ కార్యాలయ సమావేశమందిరంలో పీ-4 కార్యక్రమం అమలుపై వర్క్‌షాప్ నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో 989 బంగారు కుటుంబాలకు సర్వే చేసినట్లు కమిషనర్ తెలిపారు. సచివాలయం ఉద్యోగులు మార్గదర్శకులకు, బంగారు కుటుంబాలకు వారధులుగా ఉండి, వారిని పేదరికం నుంచి బయటకు వచ్చే విధంగా సహకారం అందించాలని అన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పోలాకి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ (1938) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మండలశాఖ అధ్యక్షుడు మూల శ్రీనివాసరావు అధ్యక్షతన ఏపీటీఎఫ్ సమావేశం జరిగింది. రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ చింతాడ దిలీప్ కుమార్ మాట్లాడుతూ.. బకాయి డీఏలను విడుదల చేయాలని, పీఆర్‌సీ కమిషన్ వేసి మధ్యంతర భృతిని 30శాతం చెల్లించాలని, 2023 డీఎస్సీ వారికి పాత పింఛన్ అమలు చేయాలని, యాప్‌లు, పర్యవేక్షణ వంటి పనుల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకుఉపాధ్యాయులంతా తీర్మానం చేసి సంతకాలతో ఆమోదం తెలిపారు. సమస్యలను ఎమ్మెల్యేలు, మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులకు లేఖలద్వారా తెలియ చేస్తామన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మూల లక్ష్మణరావు, జిల్లా కార్యదర్శి బీవీఎన్ జితేంద్ర, ఎం.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సనపల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్

పలాస, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించి కళాశాల, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి కోరారు. చదువు, సాంస్కృతిక ప్రదర్శనలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

ఎల్.ఎన్.పేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతో ఉపాధి హామీ పనులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఏపీవో శ్రీదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన, మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు గుర్తించి నివేదికలను సకాలంలో అందించాలన్నారు. అక్టోబరు నుంచి పనులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో ఈసీ కె.సింహాద్రి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లిని దర్శించుకున్న ప్రముఖులు



కోటబొమ్మాళి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజు బుధవారం పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాల జనసేన పార్టీ ఇన్‌చార్జిలు కణితి కిరణ్‌కుమార్, బలగ ప్రవీణ్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తల్లిదండ్రులు అమ్మవారిని దర్శించు కొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోరాడ గోవింద్, జిల్లా జనసేన నాయకులు పల్లి కోటేశ్వరరావు, పాగోటి అనిత్ తదితరులు ఉన్నారు.

సైకిళ్లపై దుర్గమ్మ దర్శనానికి..



సైకిళ్లపై విజయవాడ వెళ్తున్న భక్తులు

నరసన్నపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల్లో భాగంగా పలాస, సోంపేటకు చెందిన భవానీ భక్తులు దుర్గారావు, శంకరరావు, రవికుమార్ సైకిళ్లపై విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి బయలుదేరారు. బుధవారం మడపాం వద్దకు చేరుకున్నారు. వారం రోజుల పాటు సైకిళ్ల మీద 530 కిలోమీటర్లు ప్రయాణం చేసి, దసరా నాటికి విజయవాడ చేరుకుంటామని వారు తెలిపారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

నందిగాం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక నీలమణిదుర్గ ఆలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. టెక్కలికి చెందిన పీఈటీ కేశవ డ్యాన్స్ అకాడమీ నేతృత్వంలో వివిధ రకాల ప్రదర్శనలు ఇచ్చి చిన్నారులు అలరించారు. వీరికి నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, నీటి సంఘం అధ్యక్షుడు జె.జయరాం, నిర్వాహకులు కె.ధనుంజయరావు, పి.ప్రభాకరరావు బహుమతులు అందించారు.

దివ్యాంగులకు పరికరాలు

ఎల్.ఎన్.పేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు అవసరమైన పరికరాలు అందిస్తున్నట్లు సక్షం సంస్థ జిల్లా కన్వీనర్ మన్మథకుమార్‌మిశ్రో తెలిపారు. ప్రధానమంత్రి జన్మదిన వారోత్సవాల సందర్భంగా ఈ నెల 29న శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో శిబిరం నిర్వహించి పరికరాల కోసం దివ్యాంగులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఆధార్, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్, మూడు పాస్‌ఫొటోలతో హాజరుకావాలన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం గౌరవ అధ్యక్షుడిగా కేశవరావు



కేశవరావు

హిరమండలం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం గౌరవ అధ్యక్షుడిగా హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తులగాపు కేశవరావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈయనకు ఎంఈవో కె.రాంబాబు, మండల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

అమ్మవారి దర్శనానికి వెళ్లిన మహిళకు అస్వస్థత



మహిళకు సపర్యలు చేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి, సెప్టెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): కొత్తమ్మతలి దర్శనానికి వచ్చిన ఓ మహిళ బుధవారం ఉదయం ఉక్కపోతతో అస్వస్థతకు గురై కళ్లుతిరిగి పడిపోయింది. అక్కడ వైద్య శిబిరంలో ఉన్న డాక్టర్ వరుణ్ ఆమెకు ప్రథమ చికిత్స అందించారు. అయినా స్పృహలోకి రాకపోవడంతో ఆమెను 108లో స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఆమెకు మెలకువ వస్తే తప్ప వివరాలు తెలియవని వైద్యులు తెలిపారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

- విజేతలుగా విజయనగరం, కడప



కబడ్డీ పోటీ జరుగుతున్న దృశ్యం

కోటబొమ్మాళి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాల సందర్భంగా బుధవారం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. బాలికల విభాగంలో విజయనగరం జిల్లా ప్రథమ, నెల్లూరు జిల్లా ద్వితీయ స్థానం సాధించాయి. బాలుర విభాగంలో కడప జిల్లా ప్రథమ, శ్రీకాకుళం ద్వితీయ స్థానం పొందాయి. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 12 బాలికల జట్లు, 21 పురుషుల జట్లు పాల్గొన్నాయి. విజేతలకు స్థానిక టీడీపీ నేతలు, ఆలయ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు.

సంగిడి పోటీలు..

కొత్తమ్మతల్లి జాతరలో భాగంగా బుధవారం సంగిడి, ఈడుపురాయి, ఉలవల బస్తాలు ఎత్తే పోటీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణలో జరిగిన ఈ పోటీల్లో కోటబొమ్మాళి మండలం నిమ్మాడ గ్రామానికి చెందిన ఆవాల గోవిందరావు ప్రథమ బహుమతి సాధించాడు. చింతువానిపేటకు చెందిన ఆవాల వసంతరావు, ఆవాల త్రినాథ్ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరికి గురువారం బహుమతులు అందజేయనున్నారు. న్యాయనిర్ణేతలుగా టీడీపీ సీనియర్ నాయకులు కల్లి నాగయ్యరెడ్డి, లక్ష్మణరెడ్డి, శివకుమార్‌రెడి వ్యవహరించారు.



ఉలవల బస్తాను ఎత్తుతున్న గోవిందరావు

క్విజ్ పోటీ విజేతగా హరిపురం విద్యార్థులు

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా డోకులపాడులో బుధవారం జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. హరిపురం గీతం స్కూల్ విద్యార్థులు విజేతగా నిలిచారు. ద్వితీయ, తృతీయ స్థానాలల్లో వరుసుగా హరిపురం, లోహరిబంద హైస్కూల్ విద్యార్థులు నిలిచారు. మొత్తం 57 టీంలు పోటీలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు జ్ఞాపికలతో పాటు నగదు బహుమతులు అందించారు.



క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు